17వ వసంతంలోకి

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

చిత్తూరు | తిరుపతి

బుధవారం | 26 జూన్ 2024 | పేజీలు 9


## మరుపొంగళ్లతో గంగమ్మకు భక్తులు మొక్కులు



8లో



## మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పం ముద్దు బిడ్డగానే పుడతా

- నాకు ప్రత్యక్ష దేవుళ్లయిన కుప్పం ప్రజలను కలవడానికి వచ్చాను
- కుప్పంలో సీఎం చంద్రబాబుకు అడుగడుగునా ప్రజల నీరాజనాలు
- శాంతిపురం హంద్రీనీవా కాలువ పనులు పరిశీలించిన బాబు
- శివపురంలో తన సొంత ఇంటి పనులు పరిశీలన
- వర్షం పడుతున్నా సీఎం ప్రసంగం వింటూ కదలని ప్రజానీకం
- కుప్పం అభివృద్ధిని పరిగెత్తిస్తాం..ఔటర్ రింగు రోడ్డు ను నిర్మిస్తా..!
- కుప్పం నియోజకవర్గంలో కొత్తగా రెండు మండలాలు

**కుప్పం, మేజర్ న్యూస్:**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం 12.59 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ పిఈఎస్ మెడికల్ కాలేజీ హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ పి.శ్రీనివాసులు, ఉమ్మడి

మిగతా 2లో










## బిసి మంత్రులు కొల్లు రవీంద్ర, సవితమ్మకు అభినందనలు

– బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు




**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ సచివాలయంలో సోమ వారం బాధ్యతలు స్వీకరించిన ఏపీ మైన్స్, జియాలజీ. ఎక్సైజ్ శాఖ మంత్రిగా కొల్లు రవీంద్ర, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మలను గాండ్ల, తెలికుల బిసి సాధికర సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాండ్ల, తేలి కులస్తుల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. స్పందించిన మంత్రులు కచ్చితంగా ఆర్థికంగా రాజకీయంగా మీ యొక్క కులస్తులను ఆదుకుంటామని అండగా కూడా ఉంటామని వారు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి అర్చెరీ పోటీల్లో ప్రధమ, ద్వితీయ స్థానంలో ది స్కూల్ విద్యార్థులు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఈ నెల 22 వతేదీ నుండి 24వ తేదీ వరకు విజయవాడ, శాతవాహన కాలేజ్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అర్చరీ పోటీలు నిర్వహించారు. ఈ విలువిద్య పోటీల్లో ది స్కూల్ కి చెందిన కె.లోహితా రెడ్డి, అండర్ 13లో ప్రధమ స్థానం, అండర్ 15లో ద్వితీయ స్థానం, అలాగే ఎస్. పార్థివ్ అండర్ 15లో ద్వితీయ స్థానంలో రాష్ట్ర స్థాయిలో నిలిచారని కరస్పాండెంట్ జనార్ధరావు జె. పవార్ తెలిపారు. విలువిద్య పోటీల్లో విజేతలైన కె. లోహితా రెడ్డి, ఎస్. పార్థివ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువిద్యకు మంచి భవిష్యత్తు ఉందని, తమ విద్యార్థులు ఈ పోటీల్లో విజేతగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం లో హెడ్ మిస్ట్రెస్ పి. విశాల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## వైభవంగా యజ్ఞం పూజ



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** చవట గుంట మహాభారతం ఉత్స వాల్లో భాగంగా మంగళవారం యజ్ఞం పూజను అత్యంత వైభవం గా జరుపుకున్నారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలం కరించి పూజలు నిర్వహించారు. భక్తులు ఉత్సవమూర్తులను దర్శిం చుకున్నారు. తీర్థప్రసాదాలను అందుకున్నారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## గ్రామ దేవత శ్రీ బంగారమ్మ ప్రత్యేక పూజలు



**కార్వేటి నగరం, మేజర్ న్యూస్:** కార్వేటి నగరంలో వెలసిన గ్రామ దేవత శ్రీ బంగారమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించి, రాహుకాలం పూజలు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పం ముద్దు బిడ్డగానే పుడతా

( మొదటిపేజీ తరువాయి...)

చిత్తూరు జిల్లా శాసనసభ్యులు ఘన స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజా ప్రతినిధులు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును చూసేందుకు, పలకరించేందుకు వచ్చిన అశేష జనవాహినికి ఆయన అభివాదం చేస్తూ.. పలకరిస్తూ.. వారికి నమస్కరిస్తూ ముందుకు సాగారు. అనంతరం పిఈఎస్ మెడికల్ కళాశాల నుండి ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన మధ్యాహ్నం 1.18 గం.లకు శాంతిపురం మండలం జల్లిగానిపల్లిలో హంద్రీనీవా కాలువను పరిశీలించారు.తదనంతరం కుప్పం పట్టణంలో ఎన్టీయార్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగ సభ కు ముఖ్యమంత్రి హాజురయ్యారు.ఆ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశింది అయన మాట్లాడుతూ కుప్పం ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను.9వ సారి ఎమ్మెల్యే గా గెలిచాను .. ఇందులో 8 సార్లు కుప్పం నుంచే ఎమ్మెల్యే గా గెలిపించారు.మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పం ముద్దుబిడ్డగానే పుడతా..164 మంది ఎమ్మెల్యేలను గెలిపించారు.కుప్పం ప్రజలకు రుణపడి వున్నా. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ను తిరగ రాయబోతున్నాం..యువత, మహిళలు, బలహీనవర్గాలకు అవకాశం ఇచ్చాం కేబినెట్ లో 8మంది బీసీలకు అవకాశం ఇచ్చాం–ప్రజాక్షేత్రం లోకి వెళ్లేముందు మీ ఆశీస్సుల కోసమే కుప్పం వచ్చా.. వచ్చే ఐదేళ్లలో కుప్పం ప్రజల రుణం తీసుకుంటా..కుప్పంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. 1994 – 2004 వరకు, 2014 – 2019 వరకు ఎంతో అభివృద్ధి చేశాం.ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు లింకు రోడ్లు వేస్తాం పరిశుభ్రమైన నగరంగా కుప్పంను తీర్చిదిద్దుతా కుప్పం మునిసిపాలిటీ ని అభివృద్ధి చేసి..కుప్పంను మోడల్ మున్సిపాలిటీగా తయారుచేస్తాం.ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా మళ్లీ మినరల్ వాటర్ ఇస్తాం..హంద్రీ–నీవా కాలువను ఇప్పుడే పరిశీలించాం ఈ సం.. కృష్ణా జలాలు తీసుకొని వస్తాం..రాబోయే రోజుల్లో కుప్పంలో కరువు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం...అన్ని చెరువులకు నీరు నింపుతాం. సాగునీరు ఇస్తే బంగారం పండించే రైతాంగం కుప్పం లో కలరు అన్నారు.కుప్పంలో అన్నిరకాల పంటలూ పండుతాయి. టమేటాకు సంబంధించి తక్కువ ఖర్చు తో ఎక్కువ నిల్వ చేసే కోల్డ్ స్టోరేజ్ ల ఏర్పాటు..కూరగాయలు,పండ్లు,పూలు పండించే రైతాంగం తో సొసైటి ఏర్పాటు చేసి విదేశాలకు పంపేందుకు వీలైనంత తొందరలోనే కుప్పంకు విమానాశ్రయం తీసుకొని వస్తాం.కుప్పం నుంచి ఎయిర్ కార్గో ద్వారా విదేశాలకు పంపిస్తాం పాడి పరిశ్రమలో భాగంగా 10 లక్షల పాల సేకరణ కు చర్యలు..పాడి తో కోళ్లు,గొర్రెలు పెంపకం కు చర్యలు..పేదరిక నిర్మూలనలో కుప్పం దేశానికి ఆదర్శంగా కావాలన్నారు.కుప్పం అభివృద్ధి కి డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు అన్ని మారుమూల గ్రామాలకు నెట్ వర్క్ ఏర్పాటు గంజాయి రహిత రాష్ట్రం గా చేస్తాం..సంకల్పం మంచిది అయితే దేవుడు కరుణిస్తాడు.

**మళ్లీ కుప్పం బిడ్డగానే పుడతా: చంద్రబాబు**

కుప్పంలో చంద్రబాబు బహిరంగ సమావేశం ప్రారంభం కాగానే వర్షం మొదలైంది. దీంతో సమావేశం కొనసాగిద్దామా? కాసేపు ఆపుదామా అని సీఎం కోరగా.. కొనసాగించాలని కార్యకర్తలు కోరారు. 'కుప్పం దేవుళ్లను నేరుగా చూడటానికి ఇక్కడికి వచ్చా. కుప్పంలో నా సామాజికవర్గ ప్రజలు లేరు. 40 ఏళ్లుగా గెలిపిస్తున్న ఈ వెనుకబడ్డ ప్రజలే నా సామాజికవర్గం. మరోసారి కుప్పం బిడ్డగానే పుట్టాలని కోరుకుంటున్నా' అని చంద్రబాబు అన్నారు.

**కుప్పంలో ఔటర్ రింగు రోడ్డును నిర్మిస్తా:**

కుప్పం సభలో సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. 'కుప్పానికి రూ.100 కోట్లు కావాలని ప్రజలు కోరుతున్నారు. వంద కాదు.. ఎంతైనా ఇస్తా. కుప్పంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తా. రూ.10 కోట్ల చొప్పున కుప్పం, గుడిపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలకు రూ.40 కోట్లు ఇస్తా. మేజర్ పంచాయతీలకు రూ.2 కోట్లు, మైనర్ పంచాయతీకి రూ. కోటి కేటాయిస్తాం. కుప్పం మున్సిపాల్టీని రోల్ మోడల్గా మారుస్తా' అని సీఎం చంద్రబాబు చెప్పారు.






**కుప్పం నియోజకవర్గంలో కొత్తగా రెండు మండలాలు:**

చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గంలో కొత్తగా 2 మండలాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'కుప్పం నియోజకవర్గంలో మల్లనూరు, రాళ్లబూదగూరును మండలాలుగ చేయాలని కోరారు. నిన్ననే వీటి మీద ఆదేశాలు ఇచ్చా. ఇక కుప్పంలో 6 మండలాలు, ఓ మున్సిపాల్టీ ఉంటుంది. కుప్ప డిపో బస్సులను కూడా దొంగలించారు. వాటిని వెనక్కి తీసుకొచ్చాం. త్వరలో ఎలక్ట్రికల్ బస్సులను కుప్పం డిపోనకు ఇస్తాం' అని చంద్రబాబు ప్రకటించారు.

**జీతాలు ఇవ్వాలని చంద్రబాబు ఆదేశం:**

గుడిపల్లె మండల పరిధిలోని ద్రావిడ విశ్వవిద్యా లయంలో పూర్తిగా ప్రక్షాళన చేస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. విశ్వవిద్యాలయానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి అభివృద్ధి బాటలో నడిపిస్తానని తెలిపారు. అక్కడ పనిచేస్తున్న 254 మంది తాత్కాలిక ఉద్యోగులకు గత పది నెలలుగా జీతాలు అందలేదని.. వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# మెగా డీఎస్సీ అమలపై తెలుగుదేశం పార్టీ హర్షం



చంద్రబాబు ఫొటోకు పాలాభిషేకం చేస్తున్న తెలుగుదేశం నాయకులు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి మండలిలో మెగా డిఎస్సీ. ల్యాండ్ యాక్ట్ ను రద్దు చేస్తూ రెండో ఫైలుపై సంతకం చేశారు. 4వేల రూపాయలకు పింఛన్ పెంపు, అన్న క్యాంటిన్ పునరుద్దీరణ, స్కిల్ సెన్సెక్స్ పై సంతకాలు చేసి పరిపాలన ముద్ర వేశారు. కేబినెట్ సమావేశంలో మంత్రివర్గం ఆమోదం తెలపడంపై శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఫోటోకి పాలాభిషేకం నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిరుద్యోగులకు నిరాశ మిగిలించిందని, తమ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాను అధికారం చేపట్టగానే ఐదు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని మంత్రిమండలి ఆమోదించడం స్వాగతిస్తున్నామని, ఈ సంక్షేమ పథకాల వల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందన్నారు, ఇక భూ సంస్కరణ చట్టం రద్దు చేయడం ఆంధ్రప్రదేశ్ లో ప్రతి ఒక్కరు దీనిని స్వాగతిస్తున్నారని, అదేవిధంగా పేదవాడికి పట్టణం పెట్టే అన్న క్యాంటీన్ పునర్దించి పేదలకు పెట్టడం పెట్టడం, ఇలా ఐదు సంక్షేమ పథకాలను మొదటిసారిగా ప్రవేశపెట్టినందుకు తెలుగుదేశం పార్టీ నాయకులగా తాము ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఉమేష్ రావు, రాష్ట్ర బీసీ విభాగం కార్య నిర్వాహన కార్యదర్శి, నెమళ్ల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్య నిర్వహణ కార్యదర్శి తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ వైస్ ఛైర్మన్ మిన్నల్ రవి, మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె, బిసి విభాగం శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, మైనారిటీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకుడు సయ్యద్ చాంద్ బాషా, షేక్ రియాజ్, బిసి విభాగం నాయకులు పూల శేఖర్, శివ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



### మంగళం పంచాయతీ, బి.టి.ఆర్‌పురంలో

# వైభవంగా చిన్న గంగమ్మ జాతర

### పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి

**చంద్రగిరి, మేజర్ న్యూస్**

తిరుపతి రూరల్ మండలం, మంగళం పంచాయతీ, బి.టి.ఆర్ పురం, చిన్న గంగమ్మ జాతరను గ్రామ ప్రజలు మంగళవారం వేడుకగా నిర్వహించారు. జాతర సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి పట్టు వస్త్రాలతో ఊరేగింపుగా చిన్న గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు సుధా రెడ్డి కి ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులతో, యువత టపాకాయలు కలుస్తూ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తూ ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి, జనసేన, టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# వైభవంగా శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి చక్రస్నానం

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్**

అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన మంగళవారం స్వామి వారి చక్రస్నానం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ పుష్కరణ ఎదురుగా ఉదయం 9 నుంచి 11 వరకు స్వామివారి స్నపన తిరుమంజనం చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ పుష్కరిణిలో చక్రస్థానం వేడుకగా నిర్వహించారు. ఇందులో అర్చకులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



### ధ్వజరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు...

అప్పలాయగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి తొమ్మిది రోజులు పాటు నిర్వహించి ధ్వజరహణంతో ఘనంగా ముగిశాయి. మంగళవారం రాత్రి ధ్వజావరోహణ ఘట్టం నిర్వహించారు. గరుడ పటాన్ని అవనతం చేసి ధ్వజారోహణం నాడు ఆహ్వానించిన సకల దేవతలను సాగనంపారు. బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకునే వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారని ఐతిహ్యం. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్ పాల్గొన్నారు.

# మాజీ డిసిసి అధ్యక్షులు సుధాకర్ జన్మదిన వేడుకలు

**పలమనేరు మేజర్ న్యూస్):**



స్థానిక పట్టణంలోని మాజీ డిసిసి అధ్యక్షులు, బలిజ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు సుధాకర్ గారి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిం ది. రాజకీయాలకు అతీతంగా ఆయనకు ప్రతి ఒక్కరూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిజేసీ బాబు,ఏకే మూర్తి, ఆకుల గజేంద్ర ప్రసాద్, కిరణ్, హేమంత్, సుబ్బ నాగయ్య, రఘునాథ్, కోటి, పుష్పాల వెంకటేశ్వర్లు, అరుణ్, పూల చైతన్య, శివ, శ్రీధర్, నరేష్, వాసు, శ్యామ్, పగడాల ప్రవీణ్, సుదర్శన్ బాలాజీ, గణేష్, చంద్రన్న, జన, నరసింహులు, ముని రాజా,హరీష్, దైవప్రసాద్, చెంచు రెడ్డి, సోమన్న, డాక్టర్ జనార్దన్, శంకరన్న, జయశంకర్, రమేష్, బలిజ అభ్యుదయ సేవా సంఘం సభ్యులు తదితరులు శు భాకాంక్షలు తెలియజేశారు.

# కలుషిత నీరు తాగడం వలనే విద్యార్థులకు అస్వస్థత

**గూడూరు రూరల్, మేజర్ న్యూస్.**

గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు లోనీ గిరిజన గురుకుల పాఠశాలను ఇంచార్జ్ కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్.ఎం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత రెండు రోజుల క్రితం హాస్టల్ లో కలుషిత నీరు త్రాగడంతో సుమారు 20 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు... అస్వస్థతకు గురైన వారిలో ప్రస్తుతం 6 మంది విద్యార్థులు నెల్లూరు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉండడంతో హాస్టల్ కు తరలించి వైద్యుల పర్యవేక్షణ లో ఉంచారు. పాఠశాల లోని ఆర్వో ప్లాంట్ , బోరు ,ను తనిఖీ చేశారు.పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు.ఈ సందర్భంగా ఇన్చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి కలుషితం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వెల్లడించారు... మిగిలిన విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తోటి



విద్యార్థులందరికీ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.. సమస్య పరిష్కారం అయ్యేవరకు త్రాగునీటిని బయట నుండి తీసుకువచ్చి విద్యార్థులకు అందజేయాలని అధికారులకు సూచించారు. ఈయన వెంట గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ , డి.ఎం అండ్ హెచ్.వో శ్రీ హరి పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు ఎంపీడీవో రాజశేఖర్ , ఎం. ఈ.వో సనత్ కుమార్ , ఆర్డబ్ల్యూఎస్ డి. ఈ నంద కుమార్ , ఐ.టి.డి. ఏ పివో రాణి , రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి , ప్రిన్సిపాల్ మధుసూధన్ , తదితరులు పాల్గొన్నారు.



# అంకాల పరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు

**కార్వేటి నగరం, మేజర్ న్యూస్:**

కార్వేటినగరం మేజర్ పంచాయతీ డైట్ సమీపంలో వెలసిన అంకాల పరమేశ్వరి ఆలయంలో ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద రాహుకాలం పూజలు, కుంకుమార్చన నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు మహిళలు అర్చకులు జగదీష్ ఉభయ దాతలుగా వెంకటేష్ మురళి నిర్వహించారు.

### చేతివాటం ప్రదర్శిస్తున్న

# జేబు దొంగలు

**- ఆదమరిస్తే అంతే సంగతులు**

**- విలువైన వస్తువులు పోగొట్టుకోవాల్సిందే**

**చౌడేపల్లి, మేజర్ న్యూస్:**

మండలంలో మంగళవారం వారపు సంతనిర్వహిస్తారు. వారపు సంతలో దొంగతనం చేయడానికి అనుకూలంగా ఉంటుందని భావించిన దొంగలు ఇదే అదునుగా తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.ప్రజలు సంతలో కూరగాయలు కొనడమో,తమ పనులలో తాము బిజీ,బిజీ గా ఉంటే జేబు దొంగలు తమ పనితనానికి పదును పెడుచున్నారు. జేబులో ఉన్న మొబైల్ ఫోన్ స్పర్శలేకుండా కొట్టేస్తున్నారు.మహిళల మెడలో బంగారు చైన్లు సైతం



ఏమారితే టక్కున మాయమౌచున్నాయి. దీనిపైన పోలీసులు ఎంతనిఘా పెట్టిననూ దొంగలు తమ నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు.ప్రతి మంగళ వారము ఇద్దరు కానిస్టేబుళ్ళను సంతలో డ్యూటీ వేస్తున్ననూ దొంగలు పోలీసుల కళ్ళుగప్పి చేతివాటం ప్రదర్శిస్తున్నారు.పోలీసులు మాత్రం ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

# శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:**

కార్వేటి నగరం మేజర్ పంచాయతీ పుష్కరిణి కుమారగిరిపై వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ఆలయంలో అభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కేశవరెడ్డి, కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రేపు చిరుధాన్యాల పరిశోధనపై సదస్సు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:**

ఈనెల 27 నుంచి రెండు రోజులు పాటు చిరుధాన్యాల పరిశోధన పై సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ తార సత్యవతి తెలిపారు. ఈ సదస్సు ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ సంయుక్తంగా జాతీయ సదస్సు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి ఆధ్వర్యంలో ఎస్ వి వెటర్నరీ విశ్వవిద్యాలయ ఆడిటోరియం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో పాల్గొనే రైతులకు చిరుధాన్యాలపై జాతీయ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయనా పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ వి సుమతి, ఐఐఎంఆర్ శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.




## శ్రీవారిని సేవలో పలువురు సినీ ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరుని పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం విఐపి విరామ సమయంలో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు థమన్, సినీ గాయకుడు కార్తీక్, ప్రముఖ సినీ గాయని పి సుశీలమ్మలు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

**శ్రీవారిని సేవలో పాల్గొన్న సినీ నటి శ్రీలీలా**



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరుని ప్రముఖ సినీ కథానాయకి శ్రీలీలా దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం అష్టదళ పాదపద్మారాధన సేవలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల శ్రీలీలా మీడి యాతో మాట్లాడుతూ అమ్మమ్మ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్నామన్నారు. రోబిన్ హుడ్ సినిమాలో నటిస్తున్నానని తెలిపిన ఆమె మరిన్ని సినిమాలు ప్రొడక్షన్ హౌస్‌లు ప్రకటిస్తాయని తెలిపారు.

## సీఎంకు ఘన స్వాగతం పలికిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** 2024 ఎన్నికలలో ఘన విజయం సాధించి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా సొంత జిల్లా,సొంత నియోజకవర్గమైన కుప్పం రెండు రోజుల పర్యటనకు మంగళవారం మధ్యాహ్నం పిఈసి మెడికల్ కళాశాల నందు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అనంతపురం రేంజి డిఐజి. షిమోషి, జిల్లా ఎస్పీ మణికంఠ చెందొలు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు పలమనేరు అమర్నాథ్ రెడ్డి,చిత్తూరు. గురుజాల జగన్మోహన్, గంగాధర్ నెల్లూరు థామస్, నగరి గాలి భాను ప్రకాష్.సత్యవేడు కోనేటి ఆదిమూలం, చంద్రగిరి, పులవర్తి వెంకటప్రసాద్ మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, గౌనివారి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు సి.కె .జయచంద్ర రెడ్డి,(సి.కె.బాబు) సుగుణమ్మ, బాబు, గాంధీ, పుంగనూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి చల్లా బాబు రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు సి ఆర్



రాజన్, నరసింహా యాదవ్, హేమలత, శ్రీధర్ డాక్టర్ సురేష్ పిఎస్ మణిరత్నం సత్యేంద్ర, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు ముఖ్యమంత్రి కి స్వాగతం పలికారు.




## చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి సీఎం ఆత్మీయ పలకరింపు

- ఆరోగ్య పరిస్థితిపై ఆరా..
- ఇంకొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోవాలని సూచన

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కుప్పంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కుప్పం లోని పి.ఈ.ఎస్ మెడికల్ కాలేజీ హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని,తమ అధినేత నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రబాబు నాయుడు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని ఆప్యాయంగా పలకరించారు.ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇంకా కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.చంద్రగిరి నియోజక వర్గ పరిస్థితులను అడిగి తెలుసుకు న్నారు. చంద్రగిరిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని చంద్ర బాబు మాట ఇచ్చారు. ప్రస్తుత విజయం ఆరంభం మాత్రమేనని దీనిని మరింత దీర్ఘకాలం కొన సాగించేందుకు కృషి చేయా లని ముఖ్యమంత్రి అన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై వుండాల న్నారు.



## చంద్రబాబుకు శ్రీధర్ వర్మ ఘన స్వాగతం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తెలుగుదేశం పార్టీ రాయలసీమ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టి మొట్టమొదటిసారి కుప్పం నియోజకవర్గానికి విచ్చేసిన సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛాన్ని అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్మ ఎలా ఉన్నావని ఆప్యాయంగా పలకరించారు. జరిగిన ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఖుషి అభినందనీయమని కొనిఆడారు. తెలుగుదేశం పార్టీలో పని చేసిన నాయకులకు భవిష్యత్తు ఉంటుందని, మీరు చేసిన సేవలకు సముచిత స్థానం కల్పిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమ పాలన అందించేందుకు కలియుగ దైవం శ్రీవారు అనుగ్రహించాలని ఆకాంక్షించారు.



## చిన్నారి దొడ్డి వద్ద హంద్రీనీవా కాలువను పరిశీలించిన సీఎం

- సీఎం చంద్రబాబును చూసేందుకు భారీగా తరలి వచ్చిన ప్రజానీకం

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** ప్రజలను కలిసేందుకు ప్రత్యేక వాహనం నుండి దిగి ప్రజల సమస్యలను ఆలకించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. మండలంలోని తుమిసి వద్ద విభిన్న ప్రతిభా వంతురాలు చైతన్య తనకు హాట్, కిడ్నీ ప్రాబ్లం ఉందని ముఖ్యమంత్రికి విన్నవించుకోగా మహిళకు సహాయం చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి అనంతరం కడపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న తన సొంత నివాసం నిర్మాణ పనులను పరిశీలించిన సీఎం. ముఖ్యమంత్రిగా తన సొంత నియోజకవర్గానికి వచ్చిన నారా చంద్రబాబు నాయుడుని చూసేందుకు దారి పొడవునా అభి మానంతో ద్విచక్ర వాహనాలతో సందడి చేసిన అభిమానులు ముఖ్యమంత్రి వెంట తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, డాక్టర్ సురేష్, రాష్ట్ర మంత్రులు జిల్లా ఎమ్మెల్యేలు మండల నాయకులు పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు మాజీ పార్టీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి చలపతి స్వామి విజయ్ కుమార్ ఆర్ఎస్ మనీ నాగరాజు కేశవులు మాజీ ఎంపీటీసీ శ్రీరాములు బిఆర్ లోకేష్ బి వి సుధాకర్ కృష్ణారెడ్డి ఎంపీటీసీ నామాలు జిసి గోవిందరాజులు ఉయ్యాల జయరాం రెడ్డి, రామచంద్ర నాయుడు, రాజన్న, అనసూయ, కళావతి సుగుణమ్మ, శ్యామల, కార్యకర్తలు పాల్గొన్నారు.




## రేణిగుంట పంచాయతీలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- బొజ్జల సుధీర్ ఆదేశాలతో పంచాయతీల నుండి ప్రక్షాళన మొదలు
- అభివృద్ధి విషయంలో అశ్రద్ధ వద్దు

**రేణిగుంట, మేజర్‌న్యూస్:** రేణిగుంట గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న గ్రామపంచాయతీ సిబ్బంది. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బజ్జల సుధీర్ రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రేణిగుంట మండల పరిధిలో పంచాయతీలో పారిశుద్ధ్యం తాగునీటి అవసరాల విషయంలో పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యే రేణిగుంట గ్రామపంచాయతీలో ఏళ్ళ తరబడి పరిష్కారానికి నోచుకోని మురుగునీటి కాలువల పూడికలు తీయటంలో శ్రీకారం చుట్టారు. వీధికి ఇరువైపులా మురుగునీటి కాలువ పరిశుభ్రత లేకపోవడం ఇళ్ళల్లోని మురుగునీరు అంతా రహదారిపైకి చేరడంతోపాటు రోడ్డు కూడా దిగువకు ఉండడంతో వీధంతా నిత్యం మురుగుకూపంగా ఉండడం జరుగుతున్నది. ప్రజలు గతంలో బొజ్జ సుధీర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో విన్నపాలతో అనేక ఫిర్యాదులు తన అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీలో అభివృద్ధి పనులకు ప్రక్షాళన చేస్తానని హామి ఇచ్చారు. ఇందులో భాగంగానే పంచాయతీ పరిధిలో అన్ని వార్డులలో వీధులలో పంచాయతీ సిబ్బంది చేత కాలువల పూడికలు తీస్తూ అశుభ్రంగా ఉన్న పరిసర ప్రాంతాలలో శానిటేషన్, బ్లీచింగ్ వాటి ద్వారా పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమం చేపడుతున్నారు.



**తాగునీటి సమస్య కోసం....** పంచాయతీ పరిసర ప్రాంతాల్లో నిత్యం తాగునీటి సమస్య తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి చరవాణి ద్వారా ప్రజలు సమాచారం అందించడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సహకారంతో ఎమ్మెల్యే యుద్ధ ప్రాతిపదికన కొత్తగా నాలుగు కొత్త బోర్లు వేయించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రేణిగుంట ఈఓపిఆర్డి చేతుల మీదుగా బోరు పనులు ప్రారంభించారు. ప్రజల అవసరాల విషయంలో అధికారులు ఎవరు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరు సమన్వయంతో ప్రజలకు పనులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# సఖి వన్ స్టాప్ సెంటర్ గృహ హింస చట్టం విభాగ కేంద్రాలను సందర్శించిన డాక్టర్ యోగేష్ దూబే



**తిరుపతి బ్యూరో మేజర్‌న్యూస్ :** తిరుపతిలోని ఓల్డ్ మెటర్నిటీ హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేయబడిన సఖి వన్ స్టాప్ సెంటర్, గృహ హింస చట్టం విభాగం కేంద్రాలను సందర్శించి పలు సూచనలు జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డా. యోగేష్ దూబే తెలియజేశారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ గృహ హింస చట్టం విభాగం కేంద్రాల పని తీరు, సిబ్బంది యొక్క వివరాలు తెలుసుకున్నారు. కేంద్రం నందు బాధితులకు అందుచున్న సేవలు, వారి యొక్క వివరములు తెలుసుకోవటం జరిగినది. ప్రతి కేసు వారీగా బాధితులకు అందుచున్న సేవలు, వారి యొక్క అభిప్రాయాలూ తెలుసుకోవడం జరిగినది. కేంద్రం యొక్క పనితీరు మెరుగు పరచాలని సూచనలు చేయడం జరిగినది. సఖి వన్ స్టాప్ సెంటర్ నందు ఖాళీగా ఉన్న ఉద్యోగములు వీలు అయినంత త్వరగా భర్తీ చేయవలెనని ఆదేశించటం జరిగినది. తాత్కాలిక భవనము అయిన సఖి వన్ స్టాప్ సెంటర్ గృహ హింస చట్టం విభాగంలను వీలు అయినంత త్వరగా ప్రత్యేక భవనములోనికి మార్పు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమములో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారిని అయిన ఎస్ జయలక్ష్మి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్. శేఖర్, సఖి వన్ స్టాప్ సెంటర్ సెంటర్ అడ్మిన్ సుజాత, గృహ హింస చట్టం విభాగం కౌన్సిలర్ సుగుణ పాల్గొన్నారు.

# తమ స్థలాన్ని ఆక్రమించే వారి నుంచి కాపాడండి

**– మీడియా ముందు సొంత స్థల యజమానులు ఆవేదన**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** తమకు చెందిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారి నుంచి కాపాడి తమకు న్యాయం చేయాలని రాజేశ్వరి కుమారుడు గోపి కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ స్థలానికి సంబంధించిన అన్ని రకాల డాక్యుమెంట్స్ ను మీడియా ముందు ప్రవేశపెట్టి వారికి వివరించారు. తిరుమల బైపాస్ రోడ్డు అనుకుని దశాబ్దాల కాలం పాటు తమ స్వాధీన అనుభవం స్థలంలో జీవనం సాగిస్తున్నామని, బైపాస్ రోడ్డుకు స్థలాన్ని కోల్పోయిన వెంకట సుబ్బమ్మ ఇప్పుడు తమ స్థలాన్ని తమదంటూ వాదించడం సరికాదని రాజేశ్వరి కుమారుడు గోపికృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమకు చంద్రగిరి తాహాశీల్దార్ ఇచ్చిన రెండు సెంట్లు పట్టా భూమిలో నివాసం ఉంటున్నామన్నారు. తమ స్థలాన్ని వారి స్థలంగా సృష్టించి మూడు దశాబ్దాలుగా కోర్టులో మగ్గుతూ చివరికి తమ స్థలంలోనే వెంకటసుబ్బమ్మ ఫ్యామిలీ ఇల్లు నిర్మించుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు వెంకటసుబ్బమ్మ నిర్మిస్తున్న కట్టడాలను అడ్డగించాలని ప్రయత్నం అధికారులు చేసిన వారి దౌర్జన్యానికి వెనకడుగు వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. స్థల నిర్ధారణకు సర్వే చేయాలని ప్రయత్నం చేసిన వారు అడ్డగించడం విడ్డూరంగా ఉందన్నారు. సర్వే చేస్తే వెంకట సుబ్బమ్మ ఫ్లాటు అసలు విషయం బయటకు వస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సొంత స్థలాన్ని కాపాడి తమను ఆదుకోవాలని కోరారు.



# మల్లేపల్లి అటవీ ప్రాంతంలో 15ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**– ఆరుగురు స్మగ్లర్లు అరెస్టు – 2కార్లు, 2ద్విచక్రవాహనాలు సీజ్**



**తిరుపతి బ్యూరో మేజర్‌న్యూస్ :** కడప జిల్లా మల్లేపల్లి అటవీ ప్రాంతంలో 15ఎర్రచందనం దుంగలతో పాటు రెండు కార్లు, రెండు ద్వి చక్రవాహనాలను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఆరుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి అర్బన్ ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనల మేరకు ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి టీమ్ మంగళవారం కడప జిల్లా మల్లేపల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. వీరు సమీపంలోని ఆటో నగర్ చేరుకునే సరికి అక్కడ కొందరు వ్యక్తులు రెండు కార్లలో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. దీంతో వీరిని చుట్టుముట్టగా కొందరు పారిపోయారు. అయితే ఆరుగురు స్మగ్లర్లను పట్టుకోగలిగారు. వీరిని కడప టవునుకు చెందిన యాతగిరి హరి (42), కొప్పిలి సుధాకర్ రెడ్డి (29) తమళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన ప్రభు(30), రమేష్ (31), రవి (34), అయ్యప్పన్ మునియన్ (29)లుగా గుర్తించి అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలతో పాటు, 15ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు వ్యక్తుల కోసం గాలింపులు చేపట్టారు. అరెస్టు చేసిన వారిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో బదిలీలు ఎమ్మెల్యే ఆదేశాలిచ్చినా కాలయాపన ఎందుకు ?

**– గతంలో బోర్డు మెంబర్లు కొంత మందిని బదిలీలు చేసి లక్షలు రూపాయలు వసూలు**

**– ఎమ్మెల్యే గారు దేవస్థానం ఆదాయాన్ని పెంచండి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో అధికారులు చిత్ర విచిత్రంగా వ్యవహరిస్తున్నారు. దేవస్థానంపై ఎంతమంది విమర్శలు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా శ్రీకాళహస్తి దేవస్థానం ఉద్యోగస్తులలో ఇంకా మార్పు రాలేదు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. సంవత్సరాలు తరబడి ఒకే సీటులో ఉన్న సిబ్బందిని వివిధ విభాగాలకు మార్పు చేయాలని సూచించారు. అంతేగాకుండా తయారైన బదిలీ జాబితాను ఆయన పరిశీలించి కొన్ని మార్పులు కూడా చేశారు. వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వారం రోజుల క్రితం బదిలీ జాబితా తయారైనా ఇప్పటివరకు బయటకు రాలేదు. కేవలం కార్యాలయానికి, సంతకాలకు మాత్రమే పరిమితమైన ఈవో నాగేశ్వరరావు అంతర్గత బదిలీలు చేయడానికి వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. ఆయన ఈనెల 30 వతేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఒకటో తేదీ నుంచి కొత్త ఇవో రానున్నారు. అంతర్గత బదిలీలు కూడా ఆయన ద్వారానే జరిపించాలని నాగేశ్వరరావు ఆలోచన. అంతర్గత బదిలీలు అంటే గతంలో జాతర లాగా ఉండేది. ఒక్కో సీటుకు వేలం పాట పెట్టి ఎక్కువ ధర పలికిన వారికి ఆ సీటును కేటాయించే దుస్సంప్రదాయం ఏర్పడింది. అయితే ఎటువంటి వేలం పాట లేకుండా. ధరలు లేకుండా అంతర్గత బదిలీలు చేయడం అధికారులకు ఇష్టం లేనట్లుంది. కొత్త ఎమ్మెల్యే ఆదేశించినా ఇప్పటివరకు అమలు కాలేదు. దీనిపై ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. ఉద్యోగ విరమణకు ముందే నాగేశ్వరావు బదిలీలు చేస్తారా. లేదా కొత్త ఇవో చేస్తారా అనేది చర్చగా మారింది. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి సెక్షన్లో పెట్టి కుర్చీకి ఒక రేటు ఉంటుంది. ఈ పైకం మొత్తం దేవస్థానం ఈవో నుండి రాజకీయ నాయకులకు ఫలహారంగా పంపిణీ జరుగుతుంది. ఈ కుర్చీలు కొట్లాటలు వెనక లక్షల రూపాయలు చేతులు మారుతాయి గత వైయస్సార్ పార్టీ పరిపాలనలో దేవస్థానంలో తిష్ట వేసిన సీనియర్ ఉద్యోగులు లక్షల రూపాయలు దండుకుని రాజకీయ నాయకులకు పలహారంగా పంపిణీ చేశారు. ఇదే అదునుగా ప్రస్తుతం కొంతమంది అధికారులు తెలుగుదేశం చోటా నాయకులకు పరిహారం చెల్లిస్తామని రాయ బారాలు నడుపుతున్నారు. దేవస్థానంలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. బొజ్జల బృందమ్మ చెప్పిందే జరుగుతుందని పారదర్శక పాలన అందిస్తామని కొంతమంది తెలుగుదేశం పార్టీ శ్రేణులు తెలిపారు. దేవస్థానంలో ఇటు దళారులను. రాజకీయ నాయకులను. రాష్ట్ర ఎండోమెంట్ అధికారులను ప్రలోభాలకు గురి చేసే విధంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో పనిచేసే కొంతమంది ఉద్యోగులు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలుస్తున్నది. దేవస్థానంలో స్వామి అమ్మవార్ల దగ్గర పని చేసే స్వాములు దగ్గర నుండి. ప్రధాన అర్చకులు. అర్చకులు. వేద పండితులు. పరివార దేవతల పూజలు. శనీశ్వర స్వామి. గురు దక్షిణమూర్తి. వెంకటేశ్వర స్వామి చెంగల్రాయి స్వామి. అలంకార మండపం. వినాయక స్వామి. దగ్గర భక్తులు ఎక్కువగా సందర్శించి మొక్కులు తీర్చుకునేవారు. సంబంధిత దేవాలయాల దగ్గర పని చేసే స్వాముల దగ్గర కూడా గతంలో పనిచేసే బోర్డు మెంబర్లు లక్షల రూపాయలు దండుకున్నారు. ఇప్పటికైనా స్థానిక శాసన సభ్యులు స్పందించి భక్తులు వేసే ప్రతి రూపాయి దేవస్థానం హుండీలో పడేవిధంగా దేవస్థానం ఆదాయాన్ని గణనీయంగా పెంచాలని. స్వాములు తట్టల వ్యాపారాన్ని తగ్గించాలని భక్తులు కోరుతున్నారు. తట్టల ద్వారా స్వాములు దండుకునే పైకం కింద స్థాయి నుండి ఈవో వరకు. రాజకీయ నాయకుల వరకు వాటాలు కొంతమంది ఉద్యోగస్తులు చేరవేస్తున్నారని తెలుస్తున్నది. ఇటువంటి ఉద్యోగస్తులపై కఠిన చర్యలు తీసుకొని. దేవస్థానం పరిపాలనను అన్ని డిపార్టుమెంటులలో అన్ని సెక్షన్లలో ప్రధానంగా గుడిలో ప్రతి పాయింట్లో పారదర్శకత పాటించాలని శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు కోరుతున్నారు.



# సి మల్లవరంలో వైఎస్ఆర్ బోర్డులు తొలగించిన టీడీపీ నాయకులు

**చంద్రగిరి మేజర్ న్యూస్:** గ్రామ పంచాయతీ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్, జగన్మోహన్ రెడ్డి పేర్లను తిరుపతి రూరల్ మండలం సీమల్లవరం గ్రామ ప్రజలు స్థానిక టిడిపి నాయకులు కలిసి తొలగించారు. తెలుగుదేశం పార్టీ అధికారం వచ్చిన వెంటనే సీమల్లవరం గ్రామపంచాయతీ టిడిపి ఇన్చార్జ్ మనోహర్ చౌదరి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించి, పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సమయంలో గ్రామ సచివాలయంకు వైఎస్ఆర్ ఫోటోలను, జగన్మోహన్ రెడ్డి ఫోటోలను, మాజీ ఎమ్మెల్యే పేరును ఫోటోలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి దుష్యంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రెండు రోజుల్లో తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి వారికి హామీ ఇచ్చారు. పది రోజులు గడుస్తున్న ఇప్పటివరకు తొలగించకపోవడంతో గ్రామస్తులు స్థానిక టిడిపి నాయకులకు కలిసి మంగళవారం గ్రామ సచివాలయం కున్న వైఎస్ఆర్, జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రెడ్డి ఫోటోలను తొలగించారు. నేమ్ బోర్డు లను తొలగించారు . సి మల్లవరం లో ఉన్న గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం కేంద్రంకు ఉన్న బోర్డులను తొలగించారు. సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్యమంత్రి కి, ఎమ్మెల్యే నానికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి ఇంచార్జ్ మనోహర్ చౌదరి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు పద్ధతులు మార్చుకోవాలని చెప్పారు. అధికారం వచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ కూడా ఇంతవరకు వైఎస్ఆర్ సంబంధించిన బోర్డులను తొలగించుకోవడం దారుణమన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలు వచ్చే ఫిర్యాదులు నిష్పక్షపాతంగా రాజకీయాలకు అతీతంగా అధికారులు పరిష్కరించాలని కోరారు. పంచాయతీలో గతంలో జరిగిన పలు అవినీతి కార్యక్రమాలపై త్వరలో ప్రజలకు తెలియజేస్తామని ఆయన చెప్పారు. తాగునీటి కొళాయి కనెక్షన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి వేలల్లో ఫీజు వసూలు చేసి పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ కుమ్మక్కై స్వాహా చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రవికుమార్ నాయుడు, షావలి, రఘు, గణేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.





## పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**నాయుడుపేట మేజర్‌న్యూస్:** నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్యాస్ పైప్‌లైన్ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ మరియు నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎం జనార్ధన్ రెడ్డి లు ఆదేశించారు. తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం గ్యాస్ పైప్ లైన్ గుత్తేదారులతో నిర్వహించిన సమావేశంలో



వారు మాట్లాడుతూ గ్యాస్ పైప్ లైన్ లో కోసం మున్సిపాలిటీ పరిధిలో తీసిన గోతుల వల్ల ప్రజలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్నిచోట్ల తాగునీరు కలుషితమవడం తో స్థానిక ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని కనుక గుత్తేదారులు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీసిన గుంతలను మునిసిపల్ సిబ్బంది పర్యవేక్షణలోనే కురిపించాలని లేనిచో గుత్తేదారుల అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎం జనార్ధన్ రెడ్డి తో పాటు నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ లు 786 రఫీ జలదంకి కృష్ణారెడ్డి కటకం జయరామయ్య మొదలగు నాయకులు మరియు గ్యాస్ పైప్ లైన్ గుత్తేదారుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సంచార జాతులకు ఆలయ ట్రస్ట్ బోర్డులో అవకాశం కల్పించాలి



**నాయుడుపేట మేజర్‌న్యూస్:** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ సుళ్ళూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ,మాజీ పార్లమెంటు సభ్యులు , మాజీ ఎమ్మెల్యే, మాజీ టిటిడి బోర్డు మెంబర్ నెలవల సుబ్రహ్మణ్యంను దాసరి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ తుపాకుల అప్పారావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంచార జాతుల కులమైన దాసరి కులానికి ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఆలయ ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు కనుక సుళ్ళూరుపేట పట్టణంలోని శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థానం, నాయుడుపేట పట్టణంలోని శ్రీ పోలేరమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డులో దాసరి కులానికి అవకాశం కల్పించాలని శ్రీ నెలవల సుబ్రహ్మణ్యం ను తుపాకుల అప్పారావు కోరారు. ఇందుకు నెలవల సుబ్రహ్మణ్యం ప్రతిస్పందిస్తూ తప్పకుండా అవకాశం కల్పిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాసరి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ తుపాకుల అప్పారావు, దాసరి సాధికార సమితి రాష్ట్ర మెంబర్ ఇమ్మడిచెట్టి వెంకటేశ్వర్లు, మన్నూరు వెంకటేష్, తుపాకుల వంశీ, తుపాకుల చెంగయ్య, మన్నూరు వంశీ, తుపాకుల హరిబాబు, మన్నూరు నరసింహులు, తుపాకుల ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

## సాగరమల బాధితులకు ఊరట కలిగించిన తహసీల్దార్

**చిల్లకూరు మేజర్‌న్యూస్:** చిల్లకూరు మండలం, ఉడతావారి పార్లపల్లి గ్రామములో సాగర్ మాల రోడ్డుకి భూ సేకరణలో తమ భూములను కోల్పోయి, నష్టపరిహారం అందక పోవడంతో రైతులు న్యాయం కోసం రెండు రోజులుగా రోడ్డు పై బైఠాయించారు. విషయం తెలుసుకొన్న తహశీల్దారు సోమవారం సమ్మె చేస్తున్న రైతులను కలసి,హక్కు కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వ డంతో



రైతులు సమ్మెను విరవిచుకున్నారు. చిల్లకూరు తహశీల్దారు వెంట మండల రెవెన్యూ ఇన్స్పక్టర్ రమ్య, గ్రామ రెవెన్యూ అధికారి ఉన్నారు.తెలుగుదేశం పార్టీ నాయకులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి,మేకల కుమార్ ల చొరవతో అధికారుల ద్వారా తమకు న్యాయం చేస్తున్నందుకు రైతులు నాయకులకు కృతజ్ఞులు తెలియజేశారు.

## త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

**సూళ్లూరుపేట, మేజర్‌న్యూస్:** సూళ్ళురుపేట నుంచి పేర్నాడు కొరిడికికి వెళ్లే బస్సుకు మంగళవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. అసలే బస్సు రద్దీగా ఉంది,ఉదయం వేళ విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు, హాస్పిటల్ సిబ్బంది ప్రయాణికులతో రద్దీగా సూళ్లూ రుపేట నుంచిబయలు దేరిన బస్సు పేర్నాడు రోడ్ లో ఒకసారిగా అదుపు తప్పింది. డ్రైవర్ చాక చక్యంగా బస్సు ఆపి ప్రయాణి మకులను కిందకు దించారు. ఎలాంటి నష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చు కున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# నేడు నెలవల విజయశ్రీ విజయోత్సవ ర్యాలీ

**నాయుడుపేట, మేజర్ న్యూస్:** బుధవారం మధ్యాహ్నం 4:00 గంలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో సూళ్లూరుపేట నియోజకవర్గం చరిత్రలో మొట్ట మొదటి సారిగా కనీ వినీ ఎరుగని రీతిలో అత్యంత మెజారిటీతో శాసనసభ్యురాలిగా గెలుపొంది, అసెంబ్లీ లో ఎంఎల్ఏ గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నియోజకవర్గానికి డా శ్రీమతి నెలవల విజయశ్రీ వచ్చిన సందర్భంగా, రాష్ట్రంలో శ్రీ నారా చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన శుభ



సందర్భంగా కూటమి ప్రభుత్వం విజయాన్ని పురస్కరించుకొని భారీ విజయోత్సవ ర్యాలీ కార్యక్రమం జరుగును. కావున టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు కార్యకర్తలు ,అభిమానులు, ప్రింట్, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా తెలుగుదేశం పార్టీ వారు కోరుతున్నారు. ర్యాలీ పాత బస్టాండ్ అంబేద్కర్ భవనం దగ్గర నుండి బజారు వీధుల మీదుగా గాంధీ పార్క్ వరకు విజయోత్సవ ర్యాలీ జరుగును. ఆ తరువాత గాంధీ పార్క్ దగ్గర ఎంఎల్ఏ విజయశ్రీ కు సన్మాన సభ జరుగును.

# క్షయ, కుష్టు వ్యాధి లక్షణాలు నివారణపై అవగాహన

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** వైద్య ఆరోగ్య శాఖ ఏడి/డిఎల్ఏటీఓ డాక్టర్ అరుణ సులోచన దేవి ఆదేశాల మేరకు కుప్పం బాదూర్ పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ పూర్ణ ఆధ్వర్యం లో కిరణ్ కుమార్ డిప్యూటీ డెమో కుప్పం బాదూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము అనుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కుష్ఠ వ్యాధి, క్షయ, ఇతర సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ శరీరం పై స్పర్శ లేని మచ్చలు, పొడలు లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు,బొడిపలు నొప్పి లేని పుండ్లు చెవి తమ్మెలు మందంగా మారి ఉండడం ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా నిగనిగలాడే చర్మం ఉండడం మొదలైన లక్షణాలు ఉన్నట్లయితే కుష్ఠ వ్యాధి లక్షణాలుగా అనుమానించాలని వ్యాధి నిర్ధారణ కొరకు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కుష్ఠ వ్యాధి గా నిర్ధారణ జరిగితే ఖరీదయిన మందులు శస్త్ర చికిత్సలు ఉచితంగా అందించడం జరుగుతుంది అని పేర్కొన్నారు. కుష్ఠ వ్యాధి గ్రస్థులకు ఎంసీర్



చెప్పులు పంపిణి చేయడం జరుగుతుందని చెప్పారు. డాట్స్ చికిత్సతో క్షయ వ్యాధి నయమవుతుంది అని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని అటువంటి కలుషిత నీటిని తాగి నట్లీతే డయేరియా వచ్చే అవకాశం ఉందని కనుక నీటిని కాచి చల్లార్చి తాగాలని తెలిపారు. పరిసరాలలో నీరు నిలువ ఉన్నట్లయితే దోమలు అభివృద్ధి చెందుతాయి దోమ కాటు వలన మలేరియా డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు.దోమలు పుట్టకుండా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని అనగా పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని,అలాగే దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడడం, వేపాకు పొగ వేసుకోవడం కిటికీలకు మెష్‌లు బిగించుకోవడం వంటివి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ హరి కుమార్ ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు, రమణ ఆశాకార్యకర్త విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామ దేవత గంగమ్మకు నవీన్ రెడ్డి సారె

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** కొరమేను గుంట ఎస్టీ కాలనీ గ్రామ దేవత గంగమ్మకు నవీన్ కుమార్ రెడ్డి సారె ను సమర్పించారు. తాతయ్య గుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని ఐదవ మంగళవారం కోరమేనుగుంట ఎస్టీ కాలనీలో వెలసిన గ్రామ దేవత గంగమ్మ తల్లికి గ్రామస్తులు వైభవంగా గంగ జాతర నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు రాఘవేంద్ర, ధనలక్ష్మి, నాగరాజు, భారతి, శంకరయ్య, ఆశిక్, రమేష్ జాతరకు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం బిజెపి నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరక్టర్ భువన్ కుమార్ రెడ్డి లు గ్రామస్తులతో కలిసి ఊరేగింపుగా గంగమ్మ తల్లికి, మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి గంగమ్మకు సారెను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ దేవత గంగమ్మకు సారే ను సమర్పించి ప్రజలందరినీ కాపాడాలని గంగమ్మను వేడుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో కొరమేను గుంట ఎస్టీ కాలనీలో వెలసిన గ్రామ దేవత



గంగమ్మ తల్లికి ప్రతి సంవత్సరం గ్రామంలోని పెద్దలు, అన్ని వర్గాల ప్రజలు ప్రతి ఇంట పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం అన్నారు. ఈ కార్యక్రమంలో పుణ్యకోటి, చిన్న, సిద్దయ్య, సుబ్రమణ్యం జనా, ఎంకే కృష్ణ, మహేష్, మురళి స్వామి రమేష్ స్వామి పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

**పలమనేరు మేజర్‌న్యూస్ :** రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు రెండు రోజులు కుప్పం పర్యటనలో భాగంగా మంగళవారం కుప్పంలోని రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడును పలమనేరు నియోజకవర్గం మాజీ మంత్రి, ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు సీఎం హెూదాలో మొదటిసారిగా కుప్పం ప్రజలకుధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంటరామచంద్ర నాయుడు,టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## కాణిపాకం గణనాధుని సేవలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

**ఐరాల, మేజర్ న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారిని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సురేంద్ర గుప్తా కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. స్వామి వారి సందర్శ నార్ధం విచ్చేసిన వారికి ఆలయ సంప్రదాయ ప్రకారం ఆలయ ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, ఆలయ అర్చకులు,వేదపండితులు రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు,అభిషేకం నిర్వహించారు.తరువాత వారికి ఆలయ అశ్వరచన మండపంలో వేదపండితులు చే అశ్వరచన చేసిన తరువాత , ఆలయ ఏఈవో విద్యాసాగర్ రెడ్డి చేతులు మీదగా స్వామి వారి తీర్ధ ప్రసాదాలు, చిత్ర పటాలు, పట్టు వస్త్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపర్ డెంట్ వాసు, టెంపుల్ ఇన్ స్పెక్టర్ విగ్నేష్ ఐరాల మండల డిప్యూటీ తహశీల్ధార్ ఎన్. సుధాకర్ , చిత్తూరు జిల్లా కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు మరింత సౌకర్యవంతంగా, పారదర్శకంగా వసతి కల్పించాలి : ఈవో

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారి దర్శనార్ధం విచ్చేసే భక్తులకు మరింత సౌకర్యవంతంగా, పారదర్శకంగా వసతి కల్పించాలని ఈవో జె. శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఈవో మంగళవారం సాయంత్రం గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, రిసెప్షన్, ఐటీ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వసతి విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలో ఎన్ని గదులు అందుబాటులో ఉన్నాయి, ఎంత మంది యాత్రికులకు వసతి కల్పించవచ్చు అనే అంశాలపై ఈవోకు వివరించారు.సీడీ రీఫండ్, దళారులను గుర్తించడంతో పాటు వారిని నియంత్రించే మార్గాలు, తిరుపతిలో అందుబాటులో ఉన్న వసతి, కొత్తగా నిర్మాణంలో ఉన్న పిఏసిలు, ఇతర సంబంధిత అంశాలపై ఈవో సమీక్షించారు. అనంతరం పదే పదే వసతి పొందుతున్న వారి వివరాలు, గదులు సక్రమంగా ఖాళీ చేయకపోవడం, ఇతర సమస్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలో వసతి విభాగం డిప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, భాస్కర్, ట్రాన్స్‌పోర్ట్ (జిఎం) శేషారెడ్డి, ఐటీ జిఎం సందీప్ రెడ్డి, ఓఎస్డి సత్రే నాయక్, ఏఈఓ (కంప్యూటర్స్) వెంకటేశ్వర్లు నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మరుపొంగళ్లతో గంగమ్మకు భక్తులు మొక్కులు

### - ముత్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన గంగమ్మ

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** చల్లంగా చూడు గంగమ్మ తల్లీ... గంగమ్మ తల్లీ అంటూ భక్తజనం మంగళవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పొంగళు పెట్టి మొక్కులు చెల్లించి ప్రణమిల్లి వేడుకున్నారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగల్లి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గంగజాతర తర్వాత వచ్చిన ఐదోవ మంగళవారం కావడంతో కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ పట్ల అపార భక్తి ప్రపత్తులతో భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో గంగమ్మ ఆలయం వేకువజాము నుంచి భక్తుల సందడి మొదలైంది. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. పొంగళ్లు నైవేధ్యంగా అమ్మవారికి సమర్పించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం భక్తజన సందడి నెలకొంది. ఈ మేరకు ఉదయం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం ముత్యాల అలంకరణలో గంగమ్మ తల్లిని కొలువు తీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతర మొక్కుబడి వేషాలతో చిన్నా పెద్ద తేడా లేకుండా భక్తులు భక్తి శ్రద్ధలతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రణమరిల్లి మొక్కులు చెల్లించారు. మరి కొందరు భక్తులు వేయికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబళ్లు పోసి, ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయానికి విచ్చేసి భక్తులకు ఆలయ ఈవో కె. మమత అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేయించి ప్రసాదాలు వితరణ చేశారు. మేయర్ డాక్టర్ శిరీష గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



**వేషాలతో రంగస్థలి కళాకారులు మొక్కులు:** మొక్కుబడిలో భాగంగా మంగళవారం రంగస్థలి కళాకారులు వివిధ వేషధారణలో గంగమ్మ ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పౌరాణిక వేషధారణతో విచ్చేసి కళాకారులు ఆలయ ప్రదక్షణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. క్రమం తప్పక ప్రతి ఏటా సామూహికంగా సాంప్రదాయ పౌరాణిక వేషాలతో రంగస్థలి కళాకారులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం పట్ల మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ ఈవో కె. మమత అభినందించారు. అనంతరం రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కార్యదర్శి కేఎన్. రాజా. రంగస్థలి కళాకారులు పాల్గొన్నారు.





## మున్సిపల్ అభివృద్ధికై సీఎంకి వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్లు



**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడుకి మున్సిపల్ కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. కుప్పం మున్సిపాలిటీగా మారినప్పటి నుండీ కుప్పం వైసీపీ హయాంలో ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదని గ్రామ పంచాయతీ గా ఉన్న కుప్పంను మున్సిపాలిటీ మరీనా ఏ మాత్రం అభివృద్ధి కాలేదని, మున్సిపాలిటీ ని అభివృద్ధి చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కౌన్సిలర్లు జాకీర్ బాషా, సోము శేఖర్, దాము,సురేష్ కుమార్, కస్తూరీ వేలు పాల్గోన్నారు.

# వైభవంగా వరసిద్ధిని రథోత్సవం : ఈఓ

### - ఆలయ ఈవో వెంకటేశు

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో మంగళవారం అత్యంత వైభవంగా ఉదయం. 10 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు రెండు బ్యాచ్ లుగా స్వామి వారి ఆస్థాన మండపంలో నిర్వహించిన సంకటహర గణపతి వ్రతంలో పలువురు భక్తులు పూజలు చేసి ముక్కు బడులు తీర్చుకున్నారని ఆలయ ఈవో ఎ. వెంకటేశు తెలిపారు. అలాగే సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు బంగారు రథోత్సవం, ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు,స్థానికులు పాల్గొని పూజలు నిర్వహించుకున్నారన్నారు. . ఒక్కటికెట్ ధర 350 రూపాయలు ఒక్కటికెట్ కు ఒకరు అనుమతి అని వారు స్పష్టంచేశారు. సంకటహర చతుర్థి ప్రతి నెల పూర్ణమి తరువాత వచ్చే చవితి రోజున భక్తులు సౌకర్యార్థం సంకట హర గణపతి వ్రతం నిర్వహించడం అనువాయితిగా మారింది. అందులో 1.సంకట అనగా కష్టములు, 2.హర అనగా నసింప చేయునది,3. చతుర్ది అనగా,4 వ తిధి విఘ్నములకు అధిపతి అయిన గణపతికి ప్రీతీకారమైన తిధి కావున పర్వదినాన్ని పురష్కరించుకొని విద్య, ఉద్యోగం, వ్యాపారం,వివాహం,ఆరోగ్యం తదితర విషయాలలో కల్గునటువంటి ఒడిదుడుకులను అధికమించటకు ఈసంకట హర గణపతి చతుర్ధి వ్రతము ను పురాణంలో మహర్షులు తెలియజేసి యున్నారని వారు తెలిపారు. అటువంటి ఈవ్రతమును వినాయక డే స్వయంగా వెలిసిన కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి సన్నిధిలో చేసుకొంటే విద్యార్థులకు విద్య, ధనార్ధులకు ధనము, పుత్రార్ధులకు పుత్రులు, మోక్షాదులకు మోక్షము,వ్యాపారిస్టులకు వ్యాపారము, ఉద్యోగ సమస్య ఉద్యోగం వంటి రెట్టింపు ఫలితములు కల్గును.కాబట్టి యావన్మాది భక్తాదులందురూ కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి సన్నిధినందు ఆస్థాన మండపంలో నిర్వహించిన సంకట హర చతుర్ధి పర్వదిన్నాన్ని పురష్కరించుకొని సంకట హర గణపతి వ్రతం పూజా కార్యక్రమంలో పలువు భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఈవో తెలిపారు.



## అమరావతి నిర్మాణం కోసం ఐదు లక్షల విరాళం

**రామకుప్పం, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగవసారి పదవి బాధ్యతలు చేపట్టి కుప్పం పర్యటన విచ్చేసిన నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం రామకుప్పం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఏ ఆనంద్ రెడ్డి తనవంతుగా ఐదో లక్షల రూపాయల విరాళాన్ని కుప్పం బహిరంగ సభలో ముఖ్యమంత్రి కి అందజేశారు, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత ఐదు సంవత్సరాలుగా వైకాపా ప్రభుత్వం రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేయాలన్న కక్షతో మూడు రాజధానులు పేరిట రాజధాని నిర్మాణాన్ని చిన్నాభిన్నం చేసిందని, రాష్ట్రవ్యాప్తంగా నేడు అనేకమంది రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చి విరాళాలు అందించడం ఆనందదాయకమని అందులోనూ తాను ప్రాతినిధ్యం ఇస్తున్న కుప్పం నియోజకవర్గం నుండి రామకుప్ప మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 5 లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించడం అభినందనీయమని తన హర్షాన్ని వ్యక్తం చేశారు.



జనం కోసమే
సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు
( బ్రాంచ్ మేనేజర్)
ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మీనారాయణ
(రీజనల్ మేనేజర్)
ఫోన్ నెంబర్ : 6301107116

